

'భువన విజయం' ప్రదర్శన

తెలుగువారు విజ్ఞానవంతులు

- ఉగాది వేడుకల్లో కలెక్టర్ సుమిత్ కుమార్
- మాతృభాషను కాపాడుకుందాం: ఎస్పీ మణికంఠ



ఉగాది వేడుకల్లో ప్రసంగిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిన్నారుల నృత్య ప్రదర్శన

చిత్తూరు కల్చరల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే ప్రత్యేకమైన, భిన్నమైన సంస్కృతి తెలుగువారిది అని కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. ఆదివారం చిత్తూరు నాగయ్య కళాక్షేత్రంలో విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. తెలుగు అంటేనే తెలివి అని, ప్రపంచంలోనే తెలుగువారు విజ్ఞానవంతులుగా ఉన్నారని చెప్పారు. అన్ని రంగాల్లో జాతీయ, రాష్ట్రస్థాయిలో సత్తా చాటినవారు జిల్లాలో ఉండడం గర్వించదగ్గ విషయమన్నారు. వారి స్ఫూర్తితో ముందుకెళదామని ప్రజలకు పిలుపునిచ్చారు. ఎస్పీ మణికంఠ మాట్లాడుతూ.. మాతృభాషను కాపాడుకుందామని కోరారు. చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, డీఆర్వో మోహన్ కుమార్ ప్రసంగించారు. కాణిపాక వరసిద్ధి వినాయక ఆలయ వేద పండితుడు చిలకమర్తి వెంకట సుబ్బారావు తెలుగు సంవత్సరాది విశ్వావసు నామ సంవత్సర పంచాంగ శ్రవణం చేశారు. అనంతరం ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. నగరంలోని వివిధ పాఠశాలల బాలికలు సంప్రదాయ నృత్యాలతో ఆహూతులను అలరించారు. పండితులు, సాహితీవేత్తలతో 'భువన విజయం' ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వివిధ రంగాలకు చెందిన వారికి ఉగాది పురస్కారాలను ప్రదానం చేశారు. ఆర్డీవో శ్రీనివాసులు, జిల్లా టూరిజం అధికారి గౌరి, చిత్తూరు ఎమ్మెల్యే తండ్రి గురజాల చెన్నకేశవులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.



→ పంచాంగ శ్రవణం నిర్వహిస్తున్న చిలకమర్తి వెంకటసుబ్బారావు

నేడు రంజాన్

- ముస్తాబైన ఈద్గాలు, మసీదులు

చిత్తూరు కల్చరల్/చిత్తూరు అర్బన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): రంజాన్ పండుగను సోమవారం ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకోనున్నారు. ఇందుకోసం చిత్తూరు నగరంలోని గిరింపేట మసీదు మిట్ట, బైపాస్ రోడ్, ఓబనం పల్లె ఈద్గాల్లో ప్రార్థనల కోసం అన్ని ఏర్పాట్లు చేశారు. మసీదులనూ విద్యుద్దీపాలతో ముస్తాబు చేశారు. మరోవైపు ఆదివారం నగరంలోని చర్చి వీధి, బజారు వీధి, జెండామాను వీధిలోని దుకాణాలన్నీ ముస్లింలతో నిండిపోయాయి. కాగా, ముస్లింలకు ఎస్పీ మణికంఠ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. మసీదుల వద్ద భద్రతా ఏర్పాట్లు పటిష్ఠంగా చేపట్టామన్నారు.



చిత్తూరులోని పెద్ద మసీదుకు విద్యుద్దీపాలంకరణ

సీఎం చేతుల మీదుగా కళారత్న, ఉగాది పురస్కారాలు

ఉగాది పురస్కార గ్రహీతలు



తులసీనాథం నాయుడు | పురుషోత్తం నాయుడు | ఆకుల మల్లేశ్వరరావు | శ్రీవాణి ఎల్లా | మునిమల్లికార్జున | పద్మనాభం | వీఆర్ రాసాని | ఉషారాణి | సాధుల మునిరత్నం | కిరణ్ క్రాంతి చౌదరి | కంపల్లె రవిచంద్రన్ | ఆముదాల మురళి



విజయవాడలో ఆదివారం రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ఉగాది వేడుకల్లో సీఎం చంద్రబాబు నుంచి కళారత్న పురస్కారాలను అందుకుంటున్న ద్వారలక్ష్మి

బియ్యం కార్డుదారులకు ఊరట

- 'ఈకేవైసీ'కి గడువు ఏప్రిల్ 30వరకు పొడిగింపు



చిత్తూరు కలెక్టరేట్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): బియ్యం కార్డుదారుల ఈకేవైసీ నమోదుకు పౌరసరఫరాలశాఖ ఏప్రిల్ 30వ తేదీవరకు గడువు పొడిగించింది. తొలుత ఈనెల 31 వరకే సమయం ఉందని అధికారులు చెప్పినా, జిల్లాలో ఆదివారం నాటికి ఇంకా 1.53 లక్షల మంది మిగిలిపోయారు. చాలామందిలో సందేహాలుండడం, ప్రస్తుత పరీక్షల కారణంగా పిల్లలు అందుబాటులో లేకపోవడంతో గడువు పొడిగింపు అనివార్యమైంది.

అడ్డంకులెన్నో.. : ఈకేవైసీ ఎవరెవరు చేయించుకోవాల్సి ఉందో ఆ జాబితాను డీలర్లు, సచివాలయ సిబ్బందికి పౌరసరఫరాల అధికారులు పంపించారు. ఈ జాబితా ప్రకారం అక్కడ బియ్యం కార్డుదారులు చాలాచోట్ల లేరు. ఎందుకంటే గత ప్రభుత్వ హయాంలో ఒక దుకాణం పరిధిలో ఉన్నవారిని మ్యాపింగ్ చేసేటప్పుడు వేర్వేరు దుకాణాలకు అస్తవ్యస్తంగా మార్చుచేసేశారు.ఎక్కడైనా సరుకులు తీసుకునే వెసులుబాటు ఉండటంతో లబ్ధిదారులు తాము ఏ దుకాణం పరిధిలో ఉన్నామో పట్టించుకోలేదు. ఇంకొందరు వేరే ప్రాంతాలకు వెళ్లడం, ఫోన్ నెంబర్లు లేకపోవడంతో ఈకేవైసీ నమోదులో సమస్యలు తలెత్తాయి.

చిన్నారులు, వృద్ధుల వేలిముద్రలు అప్‌డేట్ కాక.. : ఐదేళ్ల తర్వాత తమ పిల్లల వేలిముద్రలను చాలామంది అప్‌డేట్ చేయించలేదు. ఇటువంటి చిన్నారులు సుమారు 30వేల మంది ఉన్నట్లు అంచనా. అలాగే వేలిముద్రలు అప్‌డేట్‌కాని వృద్ధులు కూడా సుమారు 2000 మంది ఉన్నట్లు తెల్సింది. వీరంతా ఆధార్ సెంటర్‌లో వేలిముద్రలు అప్‌డేట్ చేసుకోవాల్సి ఉంది.

ఇలా తెలుసుకోండి : ఏప్రిల్ ఒకటో తేదీనుంచి ఎండీయూల ద్వారా రేషన్ సరుకుల పంపిణీ చేపట్టనున్నారు. ఇందుకు కార్డుదారులు ఈ-పోస్ యంత్రాల్లో వేలిముద్రలు వేస్తారు. ఆ సమయంలో ఆ కార్డులో ఎవరెవరు ఈకేవైసీ నమోదు చేసుకోవాల్సి ఉందో వివరాలను లబ్ధిదారులు తెలుసుకోవచ్చు.

పట్టుకో.. పట్టుకో..!

- పెద్దబైలులో జల్లికట్టు

వెదురుకుప్పం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలం తిరుమలయ్యపల్లె గ్రామ పంచాయతీ పెద్దబైలులో ఉగాది సందర్భంగా ఆదివారం జల్లికట్టు నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి తీసుకొచ్చిన కోడెగిత్తలను అల్లెలోకి వదిలారు. వీటిని నిలువరించి, పట్టీలను దక్కించుకోవడానికి నువ్వా.. నేనా అంటూ యువకులు పోటీపడ్డారు. ఈ క్రమంలో కొందరు కోడెగిత్తల కాళ్ల కింద పడి స్వల్పంగా గాయపడ్డారు. జల్లికట్టును చూడటానికి పరిసర గ్రామాల నుంచి కూడా జనం తరలివచ్చారు.



కోడెగిత్తను నిలువరిస్తున్న యువకులు

కాణిపాకంలో ఉగాది వేడుకలు



పంచాంగ శ్రవణంలో పాల్గొన్న భక్తులు

ఐరాల(కాణిపాకం), మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలో ఉగాది వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో వరసిద్ధుడికి అభిషేకం చేశారు. మూల విరాట్‌కు చందన అలంకారం చేసి, భక్తులను స్వామి దర్శనానికి అనుమతిచ్చారు. ఆలయ కల్యాణ వేదికపై పురోహితులు మోహన్‌రామలింగం, ఆస్థాన పంచాంగకర్త శివకుమార్‌శర్మలు పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఆలయంలో ప్రథమంగా తయారు చేసిన గంటల పంచాంగం విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మురళీమోహన్, ఈవో పెంచలకిశోర్ దంపతులు, సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి, అర్చక, పండితులు పాల్గొన్నారు.



పంచాంగాన్ని చూపుతున్న ఎమ్మెల్యే మురళీమోహన్, ఈవో పెంచలకిషోర్

55 రిజిస్ట్రేషన్లతో రూ.9.10 లక్షల ఆదాయం

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఎనిమిది సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో 55 రిజిస్ట్రేషన్లు ఆదివారం జరగ్గా ప్రభుత్వ ఖజానాకు రూ.9.10 లక్షలు ఆదాయం వచ్చింది. పుంగనూరులో 25, పలమనేరులో 9, చిత్తూరు ఆర్వోలో 5, కుప్పంలో 5, చిత్తూరు రూరల్‌లో 3, బంగారుపాళ్యంలో 3, కార్వేటినగరంలో 3, నగరిలో 2 రిజిస్ట్రేషన్లు జరిగాయి. వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయాలు కూడా పనిచేశాయి. జీఎస్టీ, వ్యాట్ బకాయిదారులు తమ బకాయిలను కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌లో చెల్లించారు. కలెక్టరేట్‌లోని ఖజానా డీడీ కార్యాలయంతో పాటు అన్ని సబ్ ట్రెజరీ కార్యాలయాల్లో అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉన్నారు. ప్రభుత్వం ఎప్పటికప్పుడు వివిధ శాఖలకు బడ్జెట్, నాన్ బడ్జెట్ పద్దుల కింద గ్రాంట్లు విడుదల చేస్తుండగా వాటిని ఏటీవో, ఎస్టీవోలు ప్రాసెసింగ్ చేసి సీఎఫ్ఎంఎస్ ద్వారా బ్యాంకులకు చెల్లింపుల కోసం పంపారు. ప్రభుత్వ లావాదేవీలు కలిగి ఉన్న అన్ని వాణిజ్య బ్యాంకుల శాఖలు డీసీసీబీ శాఖలు ఆదివారం కూడా పనిచేశాయి. రంజాన్ సందర్భంగా సోమవారం సెలవు దినమైనా ఈ కార్యాలయాలు, బ్యాంకుల శాఖలు పనిచేయనున్నాయి.



చిత్తూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఆదివారం జరుగుతున్న రిజిస్ట్రేషన్లు

రేపటి నుంచి సదరం స్లాట్ల పునఃప్రారంభం

చిత్తూరు రూరల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): సదరం స్లాట్లను మంగళవారం నుంచి పునఃప్రారంభించనున్నట్లు డీసీహెచ్ఎస్ ప్రభావతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బోగస్ పింఛన్ల ఏరివేతకు రాష్ట్ర ప్రభుత్వం పింఛన్ల పునఃపరిశీలన కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. జిల్లాలోని ఏరియా ఆస్పత్రుల్లో వారానికి మూడ్రోజులపాటు పింఛన్లు పొందుతున్న దివ్యాంగులను తిరిగి పరిశీలిస్తున్నారు. ఈ కారణంగా మూడు నెలలుగా సదరం క్యాంపులు నిర్వహించలేదు. దివ్యాంగ పెన్షనర్ల సంఘాలు ప్రభుత్వానికి విజ్ఞప్తులు చేయడంతో తిరిగి ఏప్రిల్ ఒకటో తేదీనుంచి సదరం స్లాట్లను పునఃప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.

పెరుగుతున్న ఎండలు

- గంగవరంలో 39.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎండలు పెరుగుతూనే ఉన్నాయి. ఆదివారం కూడా జనం భానుడి ప్రతాపానికి తట్టుకోలేకపోయారు. గంగవరంలో 39.9, ఎస్ఆర్‌పురంలో 39.1 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మండలాల వారీగా.. నగరి, పులిచెర్ల, పూతలపట్టు, తవణంపల్లె, వెదురుకుప్పంలలో 38.4, గుడుపల్లె, శాంతిపురంలో 38.1, చిత్తూరు, గుడిపాలలో 38, సదుం, యాదమరిలో 37.9, రొంపిచెర్ల, జీడీ నెల్లూరులో 37.7, బంగారుపాళ్యంలో 37.6, నిండ్రలో 37.5, సోమలలో 37.4, ఐరాల, చౌడేపల్లె, పెనుమూరు. వి.కోట, విజయపురంలో 37.2, పెద్దమండ్యంలో 37, బైరెడ్డిపల్లె, రామకుప్పంలో 35.6, కార్వేటినగరంలో 35.4, పలమనేరు, పుంగనూరులో 35.3, పాలసముద్రంలో 33.5, కుప్పంలో 33.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.



బోసిపోయిన చిత్తూరులోని దర్గా సర్కిల్



అర్చకులకు ఉగాది పురస్కారాలను ప్రదానం చేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ మణికంఠ, చుడా చైర్‌పర్సన్ హేమలత, చిత్తూరు ఎమ్మెల్యే తండ్రి చెన్నకేశవులు నాయుడు - పురస్కారాలు అందుకున్న డప్పు, శిల్ప కళాకారులు శ్రీరంగం, త్రివిక్రమ్

ఉగాది పురస్కారాల ప్రదానం

చిత్తూరు కల్చరల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నాగయ్య కళాక్షేత్రంలో ఆదివారం ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జిల్లా పర్యాటక, ప్రజా సంబంధాల శాఖ ఆధ్వర్యంలో కమిటీ ఎంపిక చేసిన వివిధ రంగాల్లోకి వారికి ఉగాది పురస్కారాలను కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ మణికంఠ, చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, చిత్తూరు ఎమ్మెల్యే తండ్రి గురజాల చెన్నకేశవులు నాయుడు ప్రదానం చేశారు. పురస్కారాలు అందుకున్న అర్చకుల్లో.. డి.బాలసుబ్రహ్మణ్యం గురుకుల్, కె.వెంకటరమణాచార్యులు, గంగాధర గురుకుల్, కుమార్ గురుకుల్, చిలకమర్తి వెంకట సుబ్బారావు, ధర్మేశ్వ గురుకుల్ ఉన్నారు. అలాగే 'భువన విజయం' సాహితీ కళాకారులు పత్తిపాటి రమేష్ నాయుడు, శరత్‌శ్చంద్ర, వి.హరి నాయుడు, జయరాంరెడ్డి, విశ్వనాథం, చంద్రశేఖర్, బాలకృష్ణమూర్తి, మునుస్వామి, పార్థసారథి రెడ్డి, నాగరాజు, శాంతభాస్కర్‌లు పురస్కారాలను అందుకున్నారు. వీరితోపాటు డప్పు, శిల్ప కళాకారులు శ్రీరంగం, త్రివిక్రమ్, కళాకారులు కలకట రెడ్డెప్ప, లక్ష్మీపతి, టెర్రకోట రామకృష్ణ, మనోహర్‌రెడ్డి, కవులు, రచయితలు లక్ష్మి, వెంకటరత్నం, అరుణ, మాధవరెడ్డి, కేశవులు నాయుడు, శేఖర్, శ్రీరామచంద్రమూర్తిలకు కూడా పురస్కారాలను ప్రదానం చేశారు. అనంతరం సాహితీ, సాంస్కృతిక రంగాల్లో కృషిచేసిన వివిధ సంస్థలైన కుప్పం రెడ్డెమ్మ, స్పందన, చైతన్య సాహితి, హరివిల్లు లలిత కళావేదిక, తెలుగు సాంస్కృతిక సాహితి, చైతన్య సాంస్కృతిక కళాసమితి, మన సంస్కృతి సంస్థల నిర్వాహకులను సత్కరించారు. ఇటీవల నగరంలోని వివిధ పాఠశాలల్లో జరిగిన పద్యపఠనం, వక్తృత్వం, వ్యాసరచన, సామెతలు, సాహితీ క్విజ్ పోటీల్లో విజేతలకు కూడా కలెక్టరు బహుమతులను అందజేశారు.

ప్రాణం తీసిన ఈత సరదా

తమిళనాడు ఇంజనీరింగ్ విద్యార్థి మృతి



సెంథిల్ కుమార్ మృతదేహాన్ని వెలికి తీస్తున్న అగ్నిమాపక సిబ్బంది, స్థానికులు

కుప్పం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): చెరువులో సరదాగా ఈత కొట్టడానికి వెళ్లిన తమిళనాడుకు చెందిన ఇంజనీరింగ్ విద్యార్థి ఒకరు మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. తమిళనాడు రాష్ట్రం నాట్రంపల్లి తాలూకా తిరుపత్తూరుకు చెందిన ఇంజనీరింగ్ విద్యార్థి జె.సెంథిల్ కుమార్ (17) ఆదివారం కుప్పం మండలం బ్రహ్మదేవరచేన్లు సమీపంలోని చెరువులో ఈతకోసం స్నేహితులతో కలిసి సరదాగా వచ్చాడు. ఈత కొడుతున్న సమయంలో అతను చెరువులో మునిగిపోయాడు. గమనించిన స్థానికులు కాపాడటానికి ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో కుప్పం అగ్నిమాపక శాఖకు సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక శాఖాధికారి డి.ప్రవీణ్‌కుమార్ తన సిబ్బందితో వచ్చి చెరువులో గాలించి.. సెంథిల్ కుమార్ మృత దేహాన్ని వెలికి తీశారు. పోలీసులు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కుప్పం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అగ్నిమాపక సిబ్బంది నరేశ్, జయకుమార్, కృష్ణయ్య, రామ్మూర్తి, మణి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరి దుర్మరణం



మృతి చెందిన శివయ్య

బంగారుపాళ్యం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): చెన్నై-బెంగళూరు జాతీయ రహదారిలో శేషాపురం సమీపంలోని సర్వీసు రోడ్డులో ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గంగాధరనెల్లూరు మండలం కలిజవేడు పంచాయతీ నాసంపల్లెకు చెందిన శివయ్య జయంతి గ్రామంలో వివాహం చేసుకున్నాడు. స్థానికంగా పనులు చేసుకుంటూ జయంతిలో కాపురం ఉండేవాడు. శివయ్య తన ద్విచక్ర వాహనంపై సొంత పని నిమిత్తం బంగారుపాళ్యానికి వస్తుండగా, చిత్తూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు పలమనేరు వెళుతూ ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈప్రమాదంలో శివయ్య(21) తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఏఎస్‌ఐ రామచంద్రారెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత ఆత్మహత్య

చిత్తూరు అర్బన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన చిత్తూరు నగరంలోని టెలిఫోన్ కాలనీలో జరిగింది. టెలిఫోన్ కాలనీలో సోమశేఖర్ భార్య హేమావతి, తమ ఇద్దరు పిల్లలతో నివాసమున్నారు. హేమావతికి తరచూ కడుపు నొప్పి, తలనొప్పి వస్తుండేది. ఈ బాధను భరించలేక ఆదివారం ఇంట్లోని వరండాలో ఉన్న గ్రిల్‌కు ఉరేసుకుని, ఆమె ఆత్మహత్య చేసుకుంది. రెండో పట్టణ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

పురుగుల మందు తాగిన దంపతులు

● భర్త మృతి, భార్య పరిస్థితి విషమం



శంకర్ మృతదేహం - చికిత్స పొందుతున్న నిర్మల

శ్రీరంగరాజపురం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగి దంపతులు ఆత్మహత్యకు యత్నించారు. భర్త మృతి చెందగా, భార్య ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఈ సంఘటన ఎస్‌ఆర్‌పురం మండలం పిళ్లారికుప్పం సమీపంలోని ఓ మామిడి తోటలో ఈ సంఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చిత్తూరులో నివాసం ఉండే విశ్రాంత ఆర్మీ ఉద్యోగి రవికి పిళ్లారికుప్పం సమీపంలో మామిడి తోట ఉంది. ఈ తోటకు బంగారుపాళ్యంకు చెందిన శంకర్ (50), నిర్మల దంపతులు కాపలాగా ఉంటున్నారు. ఆదివారం సాయంత్రం దంపతుల మధ్య గొడవ జరిగింది. మనస్తాపానికి గురైన ఇద్దరూ పురుగుల మందు తాగేశారు. సమీపంలోని పశువుల కాపరులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారొచ్చి దంపతులను ఎస్‌ఆర్‌పురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. తర్వాత మెరుగైన వైద్యం కోసం 108లో చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ శంకర్ మృతి చెందగా, నిర్మల చికిత్స పొందుతుంది. ఆమె పరిస్థితి కూడా విషమంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేపటినుంచి పంట రుణాల పరపతి పెంపు

టెక్నికల్ కమిటీ ప్రతిపాదన ● అన్ని బ్యాంకులకు వర్తింపు

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): చెరకు, వరి, వేరుశనగ వినియోగం దృష్ట్యా వాటి అధికోత్పత్తికి జిల్లా టెక్నికల్ కమిటీ ప్రాధాన్యం ఇచ్చింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పలు పంటల ఉత్పత్తికి చేసిన సిఫార్సును రాష్ట్రస్థాయి టెక్నికల్ కమిటీ ఆమోదించింది. ఏప్రిల్ ఒకటో తేదీనుంచి జిల్లాలోని అన్ని బ్యాంకులు కమిటీ సిఫార్సు మేరకు రైతాంగానికి రుణాల పరపతి పెంచనున్నాయి.

ప్రస్తుతం.. ఇకపై..

హైబ్రిడ్ రకం వరికి ఖరీఫ్ పంటకాలంలో ఇస్తున్న రూ.46వేల నుంచి రూ.52వేలకు, రబీలో రూ.50 వేల నుంచి రూ.55 వేలకు రుణపరపతి పెంచి ఇవ్వనున్నారు. శ్రీవరి సాగుకు ఖరీఫ్, రబీ పంటకాలాలకు రూ.35 వేల నుంచి రూ. 40వేల వరకు ఇస్తారు. చెరకు ప్లాంటేషన్‌కు రూ.లక్ష నుంచి రూ.1.10లక్షల వరకు, వర్షాధారిత చెరకు పంటకు రూ.75వేల నుంచి రూ.85వేల మధ్య అందిస్తారు. నీటి ఆధారిత వేరుశనగ పంటకు ఎకరాకు రూ.38 వేల నుంచి రూ.41 వేల వరకు, వర్షాధారిత వేరుశనగ పంటకు రూ.35వేల నుంచి రూ.38వేల మధ్య ఇస్తారు. ఎకరా మినుములకు రూ.26వేల నుంచి రూ.30వేల మధ్య, పెసలుకు రూ.34వేల నుంచి రూ.37వేల మధ్య రుణాలు బ్యాంకర్లు ఇవ్వనున్నారు. ఎకరా ఉలవలకు రూ.17వేల నుంచి రూ.19 వేల మధ్య ఇస్తారు. పొడినేలలో రాగులు పంటకు రూ.18వేల పంటరుణాన్ని రూ.22వేలకు, తడినేలలో రాగులు పంటకు రూ.20వేల నుంచి రూ.25 వేలకు, సజ్జలు, జొన్నలు తడి, పొడి నేలల్లో పంటసాగుకు రూ.22 వేల నుంచి రూ.24 వేలకు పెంచి ఇస్తారు. టమోటా స్థానిక రకానికి రూ.38 వేల నుంచి రూ.41 వేలకు, హైబ్రిడ్ రకానికి రూ.73వేల నుంచి రూ.78 వేలకు, పెండాల్ రకానికి రూ.1.20లక్షల నుంచి రూ.1.25లక్షలకు పెంచారు. ఉల్లిపాయకు రూ.60వేల నుంచి రూ.65వేల మధ్య ఇస్తారు. ఉర్లగడ్డకు రూ.50వేల నుంచి రూ.55 వేలకు, మునక్కాయ పంటకు రూ.44వేల నుంచి రూ.49వేలకు, పపాయకు రూ.1.10లక్షల నుంచి రూ.1.20లక్షల మధ్య ఇస్తారు. మామిడికి రూ.49వేల నుంచి రూ.55 వేల మధ్య, సపోటకు రూ.33 వేల నుంచి రూ.43 వేల మధ్య అందిస్తారు. బెండ సాధారణ రకానికి రూ.30వేల నుంచి రూ.36వేలు, బెండ హైబ్రిడ్ రకానికి రూ.45వేల నుంచి రూ.50వేల మధ్య రుణాలు అందిస్తారు. ఎకరా చామంతి పంటకు రూ.55వేల నుంచి రూ.60 వేల మధ్య, పశుగ్రాసం పెంపకానికి రూ.31వేల నుంచి రూ.36వేలు ఇస్తారు. పాడిపశువుల కొనుగోలుకు రూ.38వేల నుంచి రూ.42వేలు ఇస్తారు. దీనిపై డీసీసీబీ సీఈవో శంకర్ బాబు మాట్లాడుతూ రాష్ట్రస్థాయి కమిటీ చేసిన సిఫార్సులను ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ప్రారంభమయ్యే కొత్త ఆర్థిక సంవత్సరం నుంచే అన్ని బ్యాంకులు పాటిస్తాయని చెప్పారు.

వరసిద్ధుడి దర్శనానికి మూడు గంటలు

ఐరాల(కాణిపాకం), మార్చి 30 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయం ఆదివారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. ఉగాదిని పురస్కరించుకుని వేలాదిగా భక్తులు జిల్లా నలుమూలల నుంచి కాణిపాకం విచ్చేశారు. ఆలయం వెలుపల వరకు ఉన్న క్యూలైన్లు నిండిపోవడంతో స్వామి దర్శనానికి సుమారు మూడు గంటల సమయం పట్టింది. ప్రతి భక్తుడికీ స్వామి దర్శనం కల్పించడానికి ఆలయ అధికారులు చర్యలు తీసుకున్నారు.



వరసిద్ధుడి దర్శనార్థం ఆలయం వెలుపల వేచి ఉన్న భక్తులు



ఈవోకు డీడీని అందిస్తున్న సప్తగిరి గ్రామీణ బ్యాంకు సిబ్బంది

పులిహోర ప్యాకింగ్ మిషన్ కొనుగోలుకు రూ.1.95 లక్షల విరాళం

కాణిపాక క్షేత్రంలో భక్తులకు అందించే పులిహోరను ప్యాకింగ్ చేసేందుకు యంత్రాన్ని కొనుగోలు చేయడానికి కాణిపాకానికి చెందిన సప్తగిరి గ్రామీణ బ్యాంకు సిబ్బంది ఆదివారం రూ.1,95,000లను డీడీ రూపంలో ఈవో పెంచలకిషోర్‌కు అందించారు. దాతలను ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను ఈవో పర్యవేక్షించారు. సప్తగిరి గ్రామీణ బ్యాంకు జనరల్ మేనేజర్ ప్రభాకరన్, ఆర్ఎం విష్ణుచరణ్, ఏఈవో రవీంద్రబాబు, సీఎఫ్‌వో నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ సెకండియర్ తరగతులు రేపట్నుంచి ప్రారంభం

చిత్తూరు సెంట్రల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మంగళవారం నుంచి ఇంటర్మీడియట్ జూనియర్ కళాశాలలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు ఇంటర్మీడియట్ విద్యామండలి కార్యదర్శి కార్తిక శుక్లా ఆదేశాలు జారీ చేశారు. 2025-26 విద్యా సంవత్సరానికి జిల్లాలోని 139 ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు, సోషల్, ట్రైబల్, బీసీ వెల్ఫేర్, ఏపీ రెసిడెన్షియల్, కేజీబీవీ, మోడల్ స్కూల్, హైస్కూల్ ప్లస్‌లోని జనరల్, ఒకేషనల్ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ సెకండియర్ తరగతులు మొదలవుతాయి. ప్రథమ సంవత్సరం అడ్మిషన్లు ఏప్రిల్ ఏడోనుంచి ప్రారంభం కానుండగా, 23వ తేదీ వరకు తరగతులు నిర్వహించనున్నారు. వేసవి సెలవులు ఏప్రిల్ 24 నుంచి జూన్ ఒకటో తేదీ వరకు ఉండగా, జూన్ 2వ తేదీ నుంచి జూనియర్ కళాశాలలు పునఃప్రారంభం కానున్నాయి. ఇదిలా ఉండగా 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి మార్చి ఒకటి నుంచి 20వ తేదీ వరకు ఇంటర్మీడియట్ పరీక్షలు నిర్వహించిన విషయం తెలిసిందే. ఆపై ప్రారంభమైన స్పాట్ ఏప్రిల్ మూడో తేదీ వరకు కొనసాగుతున్న తరుణంలో ఇంటర్మీడియట్ సెకండియర్ తరగతులు ప్రారంభం కానున్నాయి.

కాణిపాకంలో ఘనంగా కళా నివేదన



నృత్యం చేస్తున్న కళాకారిణి

ఐరాల(కాణిపాకం), మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలో ఆదివారం రాత్రి కళానివేదన కార్యక్రమాన్ని నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన కళాకారులు అనన్య, సమన్వితలు భరతనాట్యం, కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. కళాకారులను ఆలయ అధికారులు సన్మానించారు. ఏఈవో రవీంద్రబాబు, ఆలయ సూపరింటెండెంట్ కోదండపాణి తదితరులు పాల్గొన్నారు.

సర్వ శుభకరం



పంచాంగ పఠనం చేస్తున్న కరణం లక్ష్మీ సత్యనారాయణశర్మ

శ్రీకాళహస్తి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): విశ్వావసు నామ సంవత్సరం సర్వ శుభకరంగా ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉంటారని శ్రీకాళహస్తీశ్వరాలయ ఆస్థాన సిద్ధాంతి కరణం లక్ష్మీ సత్యనారాయణశర్మ అన్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం సాయంత్రం ఆయన పంచాంగ పఠనం చేశారు. ద్వాదశ రాశుల వారి గ్రహగోచారాలను వినిపించారు. ఏయే రాశుల వారి ఆదాయ వ్యయాలు, రాజ్యపూజ్యం, అవమానం వంటి అంశాలు ఎలా సాగుతాయన్న విషయాలను వివరించారు. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురిసి సమాజం సస్యశ్యామలంగా ఉంటుందన్నారు. అన్ని వర్గాల ప్రజలు సుఖసంతోషాలతో జీవిస్తారన్నారు. భూముల వ్యాపారాలు పుంజుకుని రియల్‌ఎస్టేట్ వారికి మంచి ఆదాయం వస్తుందన్నారు. ఈవో బాపిరెడ్డి, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.





ఆలయం ముందు ఉగాది పచ్చడి పంపిణీ



శ్రీవారి ఆలయం ధ్వజస్తంభం వద్ద ప్రత్యేక అలంకరణలు

ఉగాదికి కళకళలాడిన కొండ

తిరుమల, మార్చి30(ఆంధ్రజ్యోతి): విశ్వావసు నామ సంవత్సర ఉగాది శసందర్భంగా ఆదివారం తిరుమల కొండ కళకళలాడింది. శ్రీవారి ఆలయంలో ఉగాది ఆస్థానం శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామికి, విష్వక్సేనుల వారికి విశేష సమర్పణ నిర్వహించి పంచాంగ శ్రవణం చేశారు. 10 టన్నుల సంప్రదాయ పుష్పాలు, లక్ష కట్ ఫ్లవర్స్.. తొలిసారిగా కాలిఫోర్నియా, కొలంబియా నుంచి ట్రెసిలియం, డెల్ఫీనియం అనే పుష్పాలను తెప్పించి అలంకరించారు. ఆలయం ముందు గొల్లమండపం పక్కనే ఏర్పాటు చేసిన పల్లకిలో శయనిస్తున్న శ్రీనివాసుడు, ఇరువైపుల గరుత్మంతుడు, హనుమంతుడి రూపాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఇక, రాధాకృష్ణులు, వేణుగానం చేస్తున్న చిన్నకృష్ణుడు, తోటలో మిత్రులతో కలిసి మామిడిపండ్లను తింటున్న చిన్నకృష్ణుడు.. పుష్పాలతో తయారు చేసిన ఏనుగులు, నవధాన్యాలతో రూపొందించిన శ్రీమహావిష్ణువు ప్రతిమలు ప్రత్యేకంగా నిలిచాయి. ఉద్యాన వనం డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో వంద మంది కళాకారులు, టీటీడీ గార్డెన్ సిబ్బంది వంద మంది రెండురోజుల పాటు శ్రమించారు. తిరుమల మొత్తం పండుగ సందడి కనిపించింది. ఆలయం ముందు పలువురు భక్తులు ఉగాది పచ్చడి పంచిపెట్టారు.



పెనుమూరు మండలం సామిరెడ్డిపల్లె ఎస్సీ కాలనీలోని వాటర్ ట్యాంక్

నీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక ప్రణాళిక

534 గ్రామాల్లో సమస్య ఉన్నట్లు గుర్తింపు ● రూ.717.63 లక్షలు కావాలని ప్రతిపాదన

చిత్తూరు (గాంధీసర్కిల్), మార్చి 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో తాగునీటి ఎద్దడి నివారణకు అధికారులు ప్రత్యేక ప్రణాళికను తయారు చేశారు. జిల్లా వ్యాప్తంగా 23 మండలాల్లోని 534 గ్రామాల్లో తాగునీటి సమస్య ఉందని ప్రాథమికంగా అంచనా వేశారు. ఈ సమస్య నివారణకు రూ.717.63 లక్షలు అవసరం ఉంటుందని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఇటీవల ప్రభుత్వానికి ప్రతిపాదన పంపారు.

నివేదికలు ఇలా..

గ్రామీణ నీటి సరఫరా శాఖ నివేదికల ప్రకారం మండలాల వారీగా.. చిత్తూరులో 6, గుడిపాలలో 4, గంగాధరనెల్లూరులో 12, పాలసముద్రంలో 2, పెనుమూరులో 21, గుడుపల్లెలో 38, కుప్పంలో 50, రామకుప్పంలో 48, శాంతిపురంలో 39, బైరెడ్డిపల్లెలో 67, గంగవరంలో 18, పలమనేరులో 17, పెద్ద పంజాణిలో 19, వి.కోటలో 50, పుంగనూరులో 17, సోమలలో 12, బంగారుపాళ్యంలో 9, ఐరాలలో 4, పూతలపట్టులో 17, తవణంపల్లెలో 8, యాదమరిలో 44, రొంపిచెర్లలో 23, సదుంలో 9... మొత్తం 534 గ్రామాల్లో ఈ వేసవిలో తాగునీటి ఎద్దడి ఉండవచ్చని అధికారులు అంచనా వేశారు. ఇందులో 494 గ్రామాలకు ట్యాంకర్ల ద్వారా 1,03,353 ట్రిప్పుల నీటిని అందించాల్సి ఉంటుందని, ఇందుకోసం ఒక్కో ట్రిప్పునకు రూ.570 వంతున రూ.589.11 లక్షలు అవసరం ఉంటుందని ప్రభుత్వానికి నివేదిక పంపారు. ఇక కుప్పం మండలంలో 20, శాంతిపురంలో 11, గంగవరంలో 5 బోర్లు.. మొత్తం 36 బోర్లకు రూ.19.10 లక్షలు అవసరం ఉంటుందని ప్రతిపాదించారు. పెనుమూరులో 11, కుప్పంలో 20, శాంతిపురంలో 11, వి.కోటలో 10, పూతలపట్టులో 2... మొత్తం 62 బోర్లు లోతు చేయడానికి రూ.86.90 లక్షలు అవసరం ఉంటుందని నివేదించారు.

నిధుల అవసరం ఇలా..

మండలాలవారీగా ఈ వేసవిలో జూన్ వరకు నిధుల అవసరంపై ప్రతిపాదనలు ఇలా ఉన్నాయి. చిత్తూరుకు రూ.6.57లక్షలు, గుడిపాలకు రూ.4.50 లక్షలు, గంగాధరనెల్లూరుకు రూ.10.21 లక్షలు, పాలసముద్రానికి రూ.6.19 లక్షలు, పెనుమూరుకు రూ.29.65 లక్షలు, గుడుపల్లెకు రూ.31.32 లక్షలు, కుప్పానికి రూ.94.58లక్షలు, రామకుప్పానికి రూ.92.37 లక్షలు, శాంతిపురానికి రూ.64.14 లక్షలు, బైరెడ్డిపల్లెకు రూ.131.36 లక్షలు, గంగవరానికి రూ.29.90 లక్షలు, పలమనేరుకు రూ.8.48 లక్షలు, పెద్దపంజాణికి రూ.15.15 లక్షలు, వి.కోటకు రూ.91.41లక్షలు, పుంగనూరుకు రూ.19.56 లక్షలు, సోమలకు రూ.14.44 లక్షలు, బంగారుపాళ్యంకు రూ.3.60 లక్షలు, ఐరాలకు రూ.3.11 లక్షలు, పూతలపట్టుకు రూ.10.31 లక్షలు, తవణంపల్లెకు రూ.8.52 లక్షలు, యాదమరికి రూ.18.09 లక్షలు, రొంపిచెర్లకు రూ.17.58 లక్షలు, సదుంకు రూ.6.61 లక్షలు.. మొత్తం రూ.717.63లక్షలు అవసరం ఉంటుందని ప్రతిపాదించారు. ప్రస్తుతం జిల్లాలో ఏ మండలంలో కూడా తాగునీటి సమస్య లేదని.. ఒకవేళ సమస్య ఉత్పన్నమైతే తీర్చడానికి సిద్ధంగా ఉన్నామని గ్రామీణ నీటిపారుదల శాఖ అధికారులు చెబుతున్నారు. ఇక పశువులకు సంబంధించి ఈ ఏడాది ఎక్కడా తాగునీటి సమస్య ఉత్పన్నం కాకపోవచ్చని వారు అభిప్రాయపడుతున్నారు.

ఇఫ్తార్ విందులో చల్లా రామచంద్రారెడ్డి



చిన్నమసీదులో ఇఫ్తార్ విందులో పాల్గొన్న చల్లా రామచంద్రారెడ్డి

రొంపిచెర్ల, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్ల మండల కేంద్రంలోని చిన్న మసీదులో ముస్లిం మైనార్టీ కమిటీ ఆహ్వానం మేరకు ఆదివారం సాయంత్రం పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి పాల్గొన్నారు. ముస్లింల పవిత్రమైన రంజాన్ మాసం చివరి రోజున మైనార్టీలతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు. ముస్లింల సమస్యల పరిష్కారానికి తాను అందుబాటులో ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో కమిటీ పెద్దలు జి.యాహంబ్‌సాహెబ్, సుధీర్, కాలేషా, షౌకత్, అహమ్మద్, షేక్ కరీ ముల్లా, సర్పంచ్ ఇబ్రహీంఖాన్, జి.ఇమ్రాన్, అబుబకర్, బాబులాల్, అంజాద్ ఖాన్, మదరసా కమిటీ అధ్యక్షుడు గౌస్‌పీర్‌ఖాన్, మండల టీడీపీ అధ్యక్షుడు రమణ, రాగిశెట్టి రామమూర్తి, తులసీరాం, గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

వెండి కిరీటాల వితరణ



ఇరికిపెంట రామాలయంలో వెండి కిరీటాలు అందజేస్తున్న దాతలు

సోమల, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం ఇరికిపెంటలో కొలువుదీరిన కోదండ రామాలయంలోని మూలవిరాట్‌లకు దాతలు వెండికిరీటాలు అందజేశారు. ఆదివారం ఉగాది పండుగను పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇరికిపెంటకు చెందిన గల్లా రెడ్డెప్ప నాయుడు, గల్లా రెడ్డెమ్మ, ధనుంజయనాయుడు రూ.1.30 లక్షలు విలువ చేసే వెండికిరీటాలు ఆలయానికి అందించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త కోటీశ్వర రావు, మాజీ సర్పంచి శ్రీనివాసులు నాయుడు, చెన్నపట్నం చెరువు సాగునీటి సంఘం అధ్యక్షుడు బోస్, శివయ్యనాయుడు, చంద్రశేఖర్‌నాయుడు, గల్లా ధను, సతీశ్, శ్రీనివాసులు, భాస్కర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ పండుగ ఏర్పాట్ల పరిశీలన



అంజుమాన్ కమిటీతో కలిసి ఈద్గాను పరిశీలిస్తున్న సీఐ రాంభూపాల్

పుంగనూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ముస్లింల పవిత్ర రంజాన్ పండుగ సందర్భంగా సోమవారం పుంగనూరులో నమాజు పఠించే ఈద్గాలను అంజుమాన్ కమిటీ సభ్యులతో కలిసి పుంగనూరు రూరల్ సీఐ రాంభూపాల్ పరిశీలించారు. ఆదివారం స్థానిక ఎన్‌ఎస్‌పేట, రాంపల్లె, బసవరాజ ప్రభుత్వ బాలుర కాలేజీ, తోపుమఠం వద్ద ఈద్గాలను ఆయన పరిశీలించారు. సోమవారం జరిగే రంజాన్ పండుగలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు అంజుమాన్ కమిటీ సభ్యులతో చర్చించారు. శాంతియుతంగా పండుగ జరుపుకోవాలని, అన్ని ప్రాంతాల్లో పోలీసు నిఘా, పోలీస్ బందోబస్తు ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో పుంగనూరు ఎస్‌ఐ లోకేశ్, అంజుమాన్ కమిటీ ప్రధాన కార్యదర్శి ఇబ్రహీం, జాఫర్, ఇస్మాయిల్, నూర్‌షా తదితరులు పాల్గొన్నారు.

మామిడి తోటలకు నిప్పు



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పుంగనూరు రూరల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు ప్రాంతంలోని రెండుచోట్ల మామిడి, అల్లనేరేడు చెట్లకు గుర్తుతెలియని వ్యక్తులు ఆదివారం మధ్యాహ్నం నిప్పుపెట్టడంతో దాదాపు రూ.1.5 లక్షలు నష్టం జరిగినట్లు అగ్నిమాపకశాఖ అధికారి సుబ్బరాజు తెలిపారు. నెక్కుంది పంచాయతీ బత్తలాపురంలోని రైతు మణికి చెందిన మామిడి, అల్లనేరేడు చెట్లకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో దాదాపు 10 చెట్లు కాలిపోయినట్లు తెలిపారు. అలాగే పట్టణ సమీపంలోని క్షత్రియ కార్యాలయ సమీపంలోని మామిడి తోటలకు నిప్పు పెట్టినట్లు సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసే లోపు రూ.1.5 లక్షలు విలువ చేసే మామిడి చెట్లు కాలిపోయినట్లు అగ్నిమాపక సిబ్బంది తెలిపారు.

భువనమ్మ సేవలకు ప్రతిఫలం స్కోచ్ అవార్డు

కుప్పం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి, ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి చేసిన సామాజిక సేవలకు ప్రతిఫలంగా స్కోచ్ అవార్డు లభించిందని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ అన్నారు. ఎన్టీఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న న్యూట్రిఫుల్ యాప్‌తో ప్రజలకు డైట్, ఆరోగ్యంపై సూచనలు, సలహాలు అందిస్తున్నందున వచ్చిన స్కోచ్ అవార్డును ఆదివారం ఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో ఎన్టీఆర్ ట్రస్టుతోపాటు భువనేశ్వరి కూడా స్వీకరించిందని పేర్కొన్నారు. భువనేశ్వరికి ఎమ్మెల్సీ శుభాకాంక్షలు తెలిపారు. ఇటువంటి అవార్డులు మరెన్నో అందుకోవాలని ఆకాంక్షించారు.

కాలిపోయిన వ్యవసాయ పరికరాలు



కాలి బూడిదైన డ్రిప్‌పైపులు, టమోటా కట్టెలు, వ్యవసాయ పరికరాలు

చౌడేపల్లె, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ పరికరాలు అగ్నికి ఆహుతైన సంఘటన చౌడేపల్లె మండలంలో ఆదివారం జరిగింది. స్థానికుల కథనం మేరకు వివరాలు..మండలంలోని పుదిపట్లకు చెందిన వినోద్‌కుమార్‌రెడ్డికి గ్రామం సమిపంలోనే వ్యవసాయ పొలం ఉంది. ఈక్రమంలో ఆయన పొలం సమిపంలోనే గ్రామానికి చెందిన శ్మశాన వాటిక ఉంది. ఉగాది పర్వదినం కావటంతో కొందరు గ్రామస్తులు సమాదుల వద్ద పూజలు చేశారు. ఈక్రమంలో పితృదేవల సమాదుల వద్ద కడ్డీలు, కర్పూరం వెలిగించి పూజలు నిర్వహించుకున్నారు. ఆమంటలు మండుతూ..వినోద్ కుమార్‌రెడ్డి పొలంలో ఉన్న డ్రిప్ పరికరాలు, పైపులు, టమోటా కట్టెలు, వ్యవసాయ పరికరాలు అగ్నికి ఆహుతైనాయి. గ్రామస్తులతో కలసి మంటలు అదుపు చేసేలోపే సుమారు రూ..1లక్ష పైన విలువ చేయు వ్యవసాయ పరికరాలు అగ్నికి ఆహుతైనట్లు తెలిపారు.

కోడిపందేలపై దాడి.. 11 మంది అరెస్టు

పుంగనూరు రూరల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): కోడిపందేలపై దాడులు నిర్వహించి 11 మందిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ లోకేశ్ తెలిపారు. మండలంలోని వనమలదిన్నె పంచాయతీ మేకజామన పల్లె సమీపంలోని చెరువులో కోడిపందెం ఆడుతున్నట్లు సమాచారం మేరకు దాడి చేశామన్నారు. వారి నుంచి రూ.1,08,250 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రంజాన్ పండుగకు ఏర్పాట్లు సిద్ధం

సదుం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): నెలవంక దర్శనంతో ముస్లిం సోదరులు రంజాన్ పర్వదిన వేడుకలకు సిద్ధమయ్యారు. సామూహిక ప్రత్యేక ప్రార్థనల కోసం స్థానిక ఈదా లను శుభ్రపరిచారు. అలాగే సదుంలోని మసీదులను అందమైన రంగులు, విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు.

రేపటి నుంచి సీనియర్ ఇంటర్ తరగతులు

వి.కోట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఏప్రిల్ ఒకటి నుంచి సీనియర్ ఇంటర్ విద్యార్థులకు కళాశాలలో తరగతులు ప్రారంభం కానున్నట్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బాలకృష్ణారెడ్డి తెలిపారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతోపాటు నోటు పుస్తకాలు, పాఠ్యపుస్తకాలు అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. అలాగే ఏప్రిల్ 7 నుంచి ఇంటర్ మొదటి సంవత్సరం అడ్మిషన్లు ప్రారంభం అవుతాయన్నారు. పదో తరగతి పూర్తయిన విద్యార్థులు అడ్మిషన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

టీడీపీ కార్యాలయంలో ఉగాది పూజలు



టీడీపీ కార్యాలయంలో ఉగాది పూజల్లో నేతలు

రామకుప్పం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, మాజీ ఎంపీపీ ఆంజనేయరెడ్డిల ఆధ్వర్యంలో ఉగాది పూజలు ఘనంగా నిర్వహించారు. వేదపండితులు నాగరాజశర్మ పూజలు నిర్వహించి పంచాగం చదివి విన్పించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ వైస్‌చెర్మన్ సీతాపతి, నేతలు నందారెడ్డి, సలాంసాబ్, టీవీరవి, బాలరాజు, ఆదిల్, శంకర్, పద్మనాభరెడ్డి, మంజునాథ్, అల్లీశీన, నరసింహ, ఆంజి, శ్రీరాములు, చలపతి, మురళీమోహన్, చాన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే శుభాకాంక్షలు

● పలమనేరు: పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి ఆదివారం విశ్వావసు నామ సంవత్సరం సందర్భంగా తెలుగు ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. పలమనేరు డీఎస్పీ డేగల ప్రభాకర్‌తో పాటు పలువురు సీఐలు, మున్సిపల్ కమిషనర్ ఎన్.వి.రమణారెడ్డి ఎమ్మెల్యేను కలిసి ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.

వరసిద్ధుడికి ఘనంగా గ్రామోత్సవం



ఐరాల(కాణిపాకం), మార్చి 30(ఆంధ్రజ్యోతి): ఉగాది సందర్భంగా ఆదివారం రాత్రి వరసిద్ధుడి ఆలయంలో సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధుడి ఉత్సవ విగ్రహాలను కల్యాణ వేదిక వద్ద ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం వరసిద్ధుడి ఉత్సవ విగ్రహాలను భక్తి శ్రద్ధలతో మోసుకొచ్చి సప్పరంపై భాజా, భజంత్రీల మేళతాళాల మధ్య కాణిపాకంలో వైభవంగా ఊరేగించారు. కార్యక్రమంలో ఈవో పెంచలకిషోర్, ఏఈవో రవీంద్రబాబు, ఉభయదారులు పాల్గొన్నారు.

జిల్లా అర్చక పురోహిత సంఘం ఉపాధ్యక్షుడిగా
రామభద్ర నియామకం



చిత్తూరు కల్చరల్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): జిల్లా అర్చక, పురోహిత సంఘం ఉపాధ్యక్షుడిగా నగరవాసి రామభద్రను నియమించారు. ఇటీవల విజయవాడలో నిర్వహించిన రాష్ట్ర అర్చక పురోహిత సంఘం సమావేశంలో కమిటీ నాయకులు దేమూరి ఆనంద్ సూర్యా, దూర్వాసుల రామశాస్త్రి నియామక పత్రాలు అందజేశారు. ఈ మేరకు ఆదివారం జిల్లా అర్చక పురోహిత సంఘం ఉపాధ్యక్షుడిగా నియమింపబడ్డ రామభద్రకు నగర అర్చక పురోహిత సంఘం ప్రతినిధులు అభినందనలు తెలియజేశారు.

మురుగు కాలువలకు మోక్షం కలిగేనా..!

● పలమనేరులో అసంపూర్తిగా నిర్మాణాలు ● దుర్వాసన భరించలేక స్థానికుల అవస్థలు
● పట్టించుకోని అధికారులు, నాయకులు



వెన్నెల హోటల్ వద్ద నిలిచిన మురుగునీరు, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం పక్కనే.. గాంధీనగర్ పాఠశాల వద్ద... పెద్దశ్మశానం వద్ద..

పలమనేరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): పలమనేరు మున్సిపాలిటీలో పలుచోట్ల మురుగు నీటి కాలువల నిర్మాణం ఏళ్లు గడుస్తున్నా పూర్తి కాకపోవడంతో ప్రజలు మున్సిపాలిటీ తీరుపై తీవ్ర విమర్శలు చేస్తున్నారు. లక్షలాది రూపాయలు ఆదాయం వస్తున్నా.. పలుచోట్ల లక్షల రూపాయలతో అభివృద్ధి పనులు చేస్తున్నప్పటికీ మురుగునీటి కాలువలు పలుచోట్ల నిర్మాణాలు అర్థాంతరంగా ఆగిపోయి ఏళ్లు గడిచిపోతోంది. సుమారు నాలుగేళ్ల క్రితం మున్సిపల్ పాలకవర్గం పలమనేరులో పలు చోట్ల మురుగునీటి కాలువల నిర్మాణానికి మున్సిపల్ సమావేశాల్లో తీర్మానించింది. పలుచోట్ల పంచాయతీ హయాంలో నిర్మించిన మురుగునీటి కాలువల స్థానాల్లోనే కొత్తకాలువల నిర్మాణానికి ప్రతిపాదించారు. పంచాయితీ హయాంలో నిర్మించిన కాలువలను తవ్వి కొత్త కాలువలు నిర్మించకుండా అలాగే వదిలిపెట్టేశారు. దీనిపై పలుమార్లు స్థానికులు మున్సిపల్ పాలకవర్గం, అధికారుల దృష్టికి తీసుకొచ్చినా ఫలితం లేకుండా పోతోంది. నియోజకవర్గ కేంద్రంగానూ, రెవెన్యూ డివిజన్ కేంద్రం గానూ, మూడు రాష్ట్రాల కూడలిలో ఉన్న పలమనేరు పట్టణంలో నిరంతరం జనసందడిగా ఉన్న ప్రాంతాల్లోనే మురుగునీటి కాలువలు దుస్థితిలో ఉండటం.. కాలువలు లేకపోవడంతో స్థానికులు మున్సిపల్ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్న కాలువలు తవ్వి కొత్త కాలువలు నిర్మించకపోవడంతో పలుచోట్ల మురుగునీరు నిలిచిపోయి దుర్గంధం వెదజల్లుతోంది. జాతీయ రహదారి పక్కనే గ్రామచావడి ముందు, వెన్నెల హోటల్‌కు ఆనుకుని తూర్పు వైపు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద, హిందూ పెద్ద శ్మశానం వద్ద, గాంధీనగర్‌లో పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల సమీపంలో ఉన్న పాత మురుగునీటి కాలువలను తవ్వి దాదాపు రెండేళ్లు గడిచిపోతున్నా కొత్తకాలువలు మాత్రం నిర్మించలేదు. ఇకనైనా మున్సిపల్ పాలకవర్గం, మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి మురుగునీటి కాలువల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మూడు నెలల తర్వాత చర్యలు తీసుకుంటాం

వేసవి కావడంతో తొలి ప్రాధాన్యతగా తాగునీటిపై ప్రత్యేక దృష్టి సారించాం. ప్రస్తుతం మున్సిపల్‌శాఖ మంత్రి నారాయణ తాగునీరు, పారిశుధ్యం, వీధిదీపాలు, రోడ్లపై ఏర్పడిన గుంతల పూడ్చివేతకు మాత్రమే నిధులు వెచ్చించాలని ఆదేశాలు ఇచ్చారు. మూడు నెలల వరకు మురుగునీటి కాలువల నిర్మాణం చేపట్టడం కుదరదు. సాధారణ నిధులు అంతంత మాత్రంగానే ఉన్నాయి. తాగునీటి సమస్య పరిష్కారమైతే ఆ తర్వాత మురుగునీటి కాలువల నిర్మాణం చేపడుతాం.

- ఎన్.వి.రమణారెడ్డి, మున్సిపల్ కమిషనర్, పలమనేరు



ఊరూరా ఉగాది సంబరాలు



సోమల, మార్చి 30: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని సోమల మండలంలోని పలు ఆలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు. ఆవులపల్లె ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు గోపీ స్వామి పంచాంగ శ్రవణం నిర్వహించారు.



● రామకుప్పం: రామకుప్పం మండలంలో వాడవాడలా ఉగాది పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. గ్రామాల్లో అమ్మవారి ఆలయాల్లో ఆదివారం విశేష పూజలు చేపట్టారు.



● రొంపిచెర్ల: రొంపిచెర్ల మండలంలో ఆదివారం విశ్వా వసునామ సంవత్సర ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. రొంపిచెర్ల సిద్దేశ్వరస్వామి ఆలయంలో అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు చేసి పురోహితులు మునిరాజశర్మ ఆలయానికి వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.



● బైరెడ్డిపల్లె: బైరెడ్డిపల్లె మండలంలో ఆదివారం ఉగాది పండుగను ఘనంగా జరుపుకున్నారు. స్థానిక శేషాద్రిస్వామి ఆలయం, బాట గంగమ్మ ఆలయం, వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం, వీరాంజనేయస్వామి ఆలయం, కోదండరామాలయం, సల్లాపురెమ్మ ఆలయం, పట్నపల్లె కల్యాణ వెంకన్న ఆలయం, కార్వేటికొండ ధ్యానాభిరామ స్వామి ఆలయం, కడపనత్తం నలగుండ్రాయ స్వామి ఆలయంలో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● పుంగనూరు రూరల్: ఉగాదిని పురస్కరించుకుని పట్టణంలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు, పంచాంగ శ్రవణం కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం స్థానిక కల్యాణ వెంకటరమణస్వామి ఆలయం, కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం, వాసవి కన్యాకపరమేశ్వరిదేవి, భోగనంజుండేశ్వర స్వామి ఆలయాల్లో పూజలు చేశారు.



● చౌడేపల్లె: పంచాంగ శ్రవణం వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆదివారం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో వేదపండితులు స్వామివారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం వేదపండితులు పంచాంగ శ్రవణం నిర్వహించారు. కార్యక్రమంలో వశిష్టాచార్యులు, సుబ్రహ్మణ్యం, సత్యస్వామి, కుమార, ఆలయ నిర్వాహకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

● చౌడేపల్లె: ఉగాది పర్వదినాన్ని మండల ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆదివారం మండల ప్రజలు ఉపవాసాలతో పితృదేవతలకు వారి వారి ఇళ్లల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

చౌడేపల్లె, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ పుదిపట్ల పంచాయతీ మిట్టురుకు చెందిన గోవిందు తన అంగట్లో అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా అరెస్టు చేసి 14 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అలాగే చింతమాకులపల్లె వద్ద కోడి పందేలు ఆడుతున్న వెంకటరమణరెడ్డి, సుధాకర్, నాగరాజ, సురేష్, రమణ, వెంకటరమణలను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 2 కోళ్లు, కోడి కత్తులు, రూ.3600 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

లక్ష్మీనారాయణుల కల్యాణోత్సవం

గంగాధరనెల్లూరు మార్చి 30 (ఆంధ్రజ్యోతి): వేపంజేరిలో వెలసిన లక్ష్మీనారాయణులకు అభిషేకంతో పాటు కల్యాణోత్సవం పూజలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. చిత్తూరు నగరం లక్ష్మీనగర్ కాలనీకి చెందిన విశ్వనాధరెడ్డి కుటుంబసభ్యులు లక్ష్మీనారాయణుల అభిషేకం పూజలకు ఉభయదారులుగా వ్యవహరించారు. ఉత్సవమూర్తులైన శ్రీదేవి, భూదేవి సమేతుడైన నారాయణుడిని పట్టు వస్త్రాలు, పూలహారాలతో అలంకరించిన అర్చకులు వేదమంత్రాలు, మంగళవాయిద్యాలు నడుమ కల్యాణోత్సవాన్ని నిర్వహించగా వీక్షించారు. భక్తులకు మధ్యాహ్నం అన్నదానం చేశారు.

పలువురికి ఉగాది పురస్కారాలు

పశువైద్యాధికారిణికి ఉగాది పురస్కారం



సోమల, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఉగాది సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అందించే ఉగాది పురస్కారానికి పెద్దఉప్పరపల్లె పశువైద్యాధికారిణి డాక్టర్ మారసాని చందనప్రియ ఎంపికైనట్లు సోమల ఏడీహెచ్ శ్రీనివాసులు నాయుడు తెలిపారు. పశుసంవర్ధక శాఖలో విధుల నిర్వహణలో మెరుగైన సేవలు అందించినందున రాష్ట్రస్థాయి ఉగాది పురస్కారం అవార్డుకు చందనప్రియతో పాటు వల్లిగట్ల రైతుసేవా కేంద్రంలో పని చేసే పశుసంవర్ధకశాఖ సహాయకుడు మహేశ్ ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఏప్రిల్ 2వ తేదీన విజయవాడలో అవార్డు స్వీకరించనున్నట్లు ఏడీహెచ్ శ్రీనివాసులు నాయుడు తెలిపారు.

కొఠారి వెంకటరత్నానికి...

● వి.కోట: చిత్తూరు నాగయ్య కళాక్షేత్రంలో జరిగిన ఉగాది వేడుకల్లో వి.కోటకు చెందిన తెలుగు పండితులు, కవి కొఠారి వెంకటరత్నం ఉగాది పురస్కారం అందుకున్నారు. గత కొంత కాలంగా ఆయన చేసిన వివిధ రచనలు, కవితలు, గేయాల రూపంలో తెలుగు భాషకు చేసిన సేవలను గుర్తించిన ప్రభుత్వం 2025లో కవులు, సాహిత్య విభాగంలో ఉగాది పురస్కారాన్ని కొఠారి వెంకటరత్నంకు అందించారు. జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ చేతుల మీదుగా ఆయనకు పురస్కారం అందించి శాలువాతో సత్కరించారు.



పురస్కారం అందుకుంటున్న కొఠారి వెంకటరత్నం

ఆర్.మాధవ్‌కు ఉగాది పురస్కారం

పలమనేరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): పలమనేరుకు చెందిన కవి, రచయిత, పలమనేరు రచయితల సంఘం గౌరవాధ్యక్షులు ఆర్.మాధవ్‌ను ఆదివారం చిత్తూరు నాగయ్య కళాక్షేత్రంలో ఘనంగా సన్మానించారు. ఉగాది పురస్కారాల్లో భాగంగా జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు, జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ శాలువ కప్పి ఉగాది పురస్కారాన్ని అందజేశారు.



కవి, రచయిత ఆర్.మాధవ్‌ను సన్మానిస్తున్న జిల్లా ఎస్పీ, కలెక్టర్



పురస్కారం అందుకుంటున్న అర్చకులు బాలసుబ్రహ్మణ్యం

● పుంగనూరు: పుంగనూరు కోనేరు వద్ద వెలిసిన పురాతన అన్నపూర్ణాదేవి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ ప్రధాన అర్చకులు స్థానికం బాలసుబ్రహ్మణ్యంకు చిత్తూరు కలెక్టర్ సుమిత్‌కుమార్‌చే రాష్ట్ర ప్రభుత్వ ఉగాది పండిత పురస్కారాన్ని అందజేశారు. ఆదివారం చిత్తూరులో జరిగిన పురస్కారాల పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు ఎస్పీ మణికంఠ చందోల్ సత్కరించి పురస్కారాన్ని అందించారు.

ఆలయ అర్చక, పండితులకు దుస్తుల పంపిణీ



వేదపండితుడికి దుస్తులు బహూకరిస్తున్న ఈవో పెంచలకిషోర్

ఐరాల(కాణిపాకం), మార్చి 30(ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో పనిచేస్తున్న అర్చక, పండితులకు ఆదివారం సాయంత్రం ఈవో పెంచలకిషోర్ వస్త్రాలను బహూకరించారు. ప్రతి ఏటా ఆలయంలో ఉగాది వేడుకల్లో భాగంగా అర్చక, పండితులకు నూతన వస్త్రాలను బహూకరించడం ఆనవాయితీగా వస్తోంది. కార్యక్రమంలో ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్ కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీ నాయుడు, అర్చక, పండితులు పాల్గొన్నారు.

ఇళ్లత్తూరు సర్పంచ్ మృతి



విజయపురం, మార్చి 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇళ్లత్తూరు సర్పంచ్ జగదబి దీప్త (32) ఆదివారం మృతి చెందారు. కిడ్నీ సమస్యతో స్విమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందారు. మాజీ మంత్రి ఆర్కే రోజా ఫోన్‌ద్వారా ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు. వైసీపీ నాయకులు కుమారస్వామిరెడ్డి, మండల వైసీపీ అధ్యక్షుడు శివరాజు, నాయకులు సతీష్‌యాదవ్ తదితరులు ఆమె మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

వరసిద్ధుడికి ఘనంగా గ్రామోత్సవం



ఐరాల(కాణిపాకం), మార్చి 30(ఆంధ్రజ్యోతి): ఉగాది సందర్భంగా ఆదివారం రాత్రి వరసిద్ధుడి ఆలయంలో సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధుడి ఉత్సవ విగ్రహాలను కల్యాణ వేదిక వద్ద ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం వరసిద్ధుడి ఉత్సవ విగ్రహాలను భక్తి శ్రద్ధలతో మోసుకొచ్చి సప్పరంపై భాజా, భజంత్రీల మేళతాళాల మధ్య కాణిపాకంలో వైభవంగా ఊరేగించారు. కార్యక్రమంలో ఈవో పెంచలకిషోర్, ఏఈవో రవీంద్రబాబు, ఉభయదారులు పాల్గొన్నారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో టీడీపీ నేతలు

పెనుమూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): కులమతాలకు అతీతంగా అందరినీ కలుపుకునే నైతిక విలువలు కలిగిన పార్టీ టీడీపీ అని, ముస్లింలను సోదరభావంతో భావిస్తామని ఆ పార్టీ మండల అధ్యక్షుడు రుద్రయ్య నాయుడు అన్నారు. ఆదివారం పెనుమూరు మసీదులో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. రాష్ట్ర టీఎన్‌టీయూసీ కార్యనిర్వాహక కార్యదర్శి లోకనాథ నాయుడు, జిల్లా కార్యదర్శి తలారి రెడ్డెప్ప, ప్రధాన కార్యదర్శి భాస్కర్, సురేష్ నాయుడు, గిరి, మాబాషా, రఫీ, అల్తాఫ్, మున్నా, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

వైభవంగా కొమ్మేపల్లమ్మ తిరునాళ్ల



ప్రత్యేక అలంకరణలో కొమ్మేపల్లి అమ్మవారు

యాదమరి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కృష్ణంపల్లి పంచాయతీ, ఎర్రచేను అటవీ ప్రాంతంలో వెలసిన కొమ్మేపల్లమ్మ తిరునాళ్ల, ఉగాది సందర్భంగా కన్నులపండుగగా ప్రారంభమైంది. ఉగాదిని పురస్కరించుకుని ఆదివారం ఉదయం కొమ్మేపల్లి అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక అలంకరణలు నిర్వహించి, భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం ఉగాది పచ్చడితో నైవేద్యం సమర్పించారు. ఆచార్యులు ఉగాది పంచాంగ శ్రవణం చదివారు. సాయంకాలం భజన కార్యక్రమం నిర్వహించి, అన్నదానం చేశారు. పెద్దఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి ఏర్పాటు చేసిన సాంస్కృతిక నాటక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పద్మనాభరెడ్డి, సర్పంచి సుబ్బారెడ్డి, జగన్నాథరెడ్డి, నటరాజరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీనారాయణుల కల్యాణోత్సవం



ఉభయదారులకు స్వామివారి చిత్రపటాన్ని అందజేస్తున్న అర్చకులు

గంగాధరనెల్లూరు మార్చి 30 (ఆంధ్రజ్యోతి): వేపంజేరిలో వెలసిన లక్ష్మీనారాయణులకు అభిషేకంతో పాటు కల్యాణోత్సవం పూజలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. చిత్తూరు నగరం లక్ష్మీనగర్ కాలనీకి చెందిన విశ్వనాథరెడ్డి కుటుంబసభ్యులు లక్ష్మీనారాయణుల అభిషేకం పూజలకు ఉభయదారులుగా వ్యవహరించారు. ఉత్సవమూర్తులైన శ్రీదేవి, భూదేవి సమేతుడైన నారాయణుడిని పట్టు వస్త్రాలు, పూలహారాలతో అలంకరించిన అర్చకులు వేదమంత్రాలు, మంగళవాయిద్యాలు నడుమ కల్యాణోత్సవాన్ని నిర్వహించగా, భక్తులు కనుల పండుగగా వీక్షించారు. కల్యాణోత్సవంతో పాటు భక్తులకు మధ్యాహ్నం అన్నదానానికి చెన్నైకి చెందిన శ్రీదేవి, ప్రసాద్ దంపతులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఈకార్యక్రమంలో చెన్నై హైకోర్టు లాయర్ గాంధీ, జయరాజ్, ఆలయ మేనేజర్ నల్లా వెంకటేశులురెడ్డి, అర్చకులు విష్ణుస్వామి, గోవిందస్వామి, ద్వివేది, గౌరీష్, భక్తులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుకు భూమి పూజ



ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ చేస్తున్న గంధమనేని రాజేష్

నింద్ర, మార్చి 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓరూరు పేటలో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుకు టీడీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు స్వర్గీయ గంధమనేని రమేష్ చంద్ర ప్రసాద్ తనయుడు రాజేష్ ఆధ్వర్యంలో ఆదివారం భూమిపూజ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ చరిత్రను తిరగ రాసిన ఘనత తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామరావుకే దక్కుతుందన్నారు. తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన మహోన్నత వ్యక్తి ఎన్టీఆర్ అని, ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధుడికి
100వ జన్మదిన వేడుకలు



జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న కుటుంబ సభ్యులు

యాదమరి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రచేను గ్రామానికి చెందిన వృద్ధుడు దేమాలి కృష్ణారెడ్డి 100వ జన్మదిన వేడుకలను ఆదివారం ఆయన కుటుంబ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కేక్ కట్‌చేసి అందరికీ పంచిపెట్టారు. తన జన్మదిన వేడుకలను మనవళ్లు, మనవరాళ్లు, మునిమనవళ్లు, మునిమనవరాళ్ల మధ్య జరుపుకోవడం సంతోషంగా ఉందని కృష్ణారెడ్డి తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో
ఇల్లు సహా సామగ్రి దగ్ధం

వెదురుకుప్పం, మార్చి 30(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం పెద్దహరిజనవాడకు చెందిన టి.విజులయ్య ఇంటికి షార్ట్ సర్క్యూట్ జరగడంతో ఇల్లు సహా సామగ్రి కాలిపోయి నష్టం జరిగిందని స్థానికులు తెలిపారు. ఆదివారం విద్యుత్ స్తంభం నుంచి ఎర్త్‌వైర్ తెగి కిందపడిన కారణంగా కరెంటు రిటర్న్ సప్లయ్ జరిగి షార్ట్ సర్క్యూట్‌తో ఇంటిలోని సామగ్రి అంతా కాలిపోయింది. ఈ విషయం తెలుసుకున్న కార్వేటినగరం తెలుగు యువత అధ్యక్షుడు తోటి మురళీమోహన్, మాజీ వైస్ ఎంపీపీ తోటి రవికుమార్ అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఏపీఎస్పీడీఎస్ఎల్ ఉద్యోగులకు సమాచారం అందించి మరమ్మతులు చేయించారు. ఈ సమాచారం తెలుసుకున్న ఏపీ మాల వెల్ఫేర్ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ యుగంధర్ పొన్న జనసైనికులతో కలసి అక్కడికి చేరుకున్నారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వపరంగా ఆదుకుంటామని తెలిపారు. బాధితుడికి ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట జనసేన నాయకులు రాజేష్, విజయ్, సెల్వి, జగదీష్, చంద్ర, ప్రవీణ్, సునీల్ పాల్గొన్నారు.

ఎస్ఐకి సన్మానం

శ్రీరంగరాజపురం, మార్చి 30(ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్‌పురం మండలం పోలీస్‌స్టేషన్‌లో ఉగాది సందర్భంగా ఆదివారం జాతీయ హ్యూమన్ రైట్స్ అధ్యక్షుడు ఢిల్లీబాబు, ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, సభ్యులు ఎస్ఐ సుమన్‌ను పూలమాల వేసి శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం మండల అధ్యక్షుడు బాలక్రిష్ణయ్య, శాంతికుమార్, చంద్రశేఖర్, వెంకటముని, ప్రభాకర్, ఆలీ అబ్బాస్, జవహర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్ కార్యాలయం ప్రారంభం

పూతలపట్టు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జగన్నాథరెడ్డి కాంప్లెక్స్‌లో ఆదివారం ప్రెస్‌క్లబ్ నూతన కార్యాలయాన్ని టీడీపీ నేత గుంటూరు మురళి, టీడీపీ మాజీ కన్వీనర్ ప్రతాపనేని చంద్రమౌళిలు ప్రారంభించారు. కార్యక్రమంలో ఏపీ యూడబ్ల్యూజే రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కె.అశోక్‌కుమార్, బీజేపీ మండల అధ్యక్షుడు ప్రసాద్, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు జి.మణి, ఉపాధ్యక్షుడు హేమకుమార్, ప్రధానకార్యదర్శి రమణ, కోశాధికారి శేఖర్, సభ్యులు పాల్గొన్నారు.

ఏఎంసీ చైర్మన్‌కు సన్మానం



రాజమ్మను సన్మానిస్తున్న వీహెచ్‌పీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మురళీరాజు

విజయపురం, మార్చి 30(ఆంధ్రజ్యోతి): నగరి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఇటీవల ఎన్నికైన రాజమ్మను ఆదివారం మండలంలోని మహారాజపురంలో విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మురళీరాజు శాలువాతో సన్మానించారు. మరెన్నో పదవులు అలంకరించాలని, ప్రజలకు సేవ చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పార్వతి, పుట్టపర్తి సాయిట్రస్టు సభ్యురాలు గిరిజ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లత్తూరు సర్పంచ్ మృతి



దీప్త (ఫైల్ ఫొటో)

విజయపురం, మార్చి 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇళ్లత్తూరు సర్పంచ్ జగదబి దీప్త (32) ఆదివారం మృతి చెందారు. కిడ్నీ సమస్యతో స్విమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందారు. మాజీ మంత్రి ఆర్కే రోజా ఫోన్‌ద్వారా ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు. వైసీపీ నాయకులు కుమారస్వామిరెడ్డి, మండల వైసీపీ అధ్యక్షుడు శివరాజు, నాయకులు సతీష్‌యాదవ్ తదితరులు ఆమె మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచార సేకరణ
ఆర్‌టీఐతోనే సాధ్యం

గంగాధరనెల్లూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యాలయాల్లో సాధారణ పౌరుడు ప్రభుత్వపరంగా ఎటువంటి వివరాలు సేకరించుకోవాలన్నా ఆర్‌టీఐ(సమాచార హక్కుచట్టం)తోనే సాధ్యమని ఆ యూనియన్ జాతీయ అధ్యక్షుడు బండి పట్టాభిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ డి.కె.కుమార్, యూనియన్ సలహాదారు డాక్టర్ తిలక్ అన్నారు. ఉగాదిని పురస్కరించుకుని గంగాధరనెల్లూరు ఆర్‌టీఐ అసోసియేషన్ యూనియన్ ఆఫీస్‌లో ఆదివారం యూనియన్ నేతలు, సభ్యులు ఉగాది సంబరాలు నిర్వహించారు. ఉగాది పచ్చడిని పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టీఐ యూనియన్ నేతలు గిరిబాబు, జయరాజ్, సభ్యులు డాక్టర్ బాలు, హేమచంద్ర, లోకనాథ నాయుడు, కోదండరెడ్డి, స్టీఫెన్, నీలావతి, వెంకటేష్ పాల్గొన్నారు.



తిలక్‌కు కేక్ తినిపిస్తున్న బండి పట్టాభిరెడ్డి

ప్రభుత్వం ఆదేశించినా తొలగని పేడదిబ్బలు

- పట్టించుకోని పంచాయతీ అధికారులు



కార్వేటినగరం మండలం దిగువ ఎర్రమరాజుపల్లెలో - ఎగువ ఎర్రమరాజుపల్లె పంచాయతీ కార్యాలయం ముందు - అమ్మోరుగుంటలో రోడ్డుపక్కన పేడదిబ్బలు

వెదురుకుప్పం, మార్చి 30(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో, రోడ్డు పక్కన పేడ దిబ్బలు, చెత్తకుప్పలు ఉండరాదని, ఉంటే వాటిని వెంటనే తొలగించాలని ప్రభుత్వం ఆదేశించినా కనీసం పంచాయతీ కార్యాలయం ముందు, ప్రభుత్వ పాఠశాల వద్ద కూడా తొలగించకపోవడం గ్రామ పంచాయతీ ఉద్యోగుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా కనిపిస్తోంది. కార్వేటినగరం మండలం గాదంకి, ఎగువ ఎర్రమరాజుపల్లె పంచాయతీల్లో ఎక్కడపడితే అక్కడ పేడ దిబ్బలు, చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. ఎగువ ఎర్రమరాజుపల్లె పంచాయతీ కార్యాలయం ముందు ఉన్న పేడదిబ్బలను తొలగించలేదు. ఆ గ్రామంలో రోడ్డు పక్కన కూడా పేడ దిబ్బలు అలానే ఉన్నాయి. ఆ పంచాయతీలోని దిగువ ఎర్రమరాజుపల్లె అంగన్వాడీ, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ముందు పేడదిబ్బల నిల్వలు ఉన్నాయి. దిగువ ఎర్రమరాజుపల్లి కాలనీ వద్ద పశువుల కోసం నిర్మించిన తాగునీటి తొట్టి వద్ద పేడదిబ్బ, చెత్తకుప్పలు ఉన్నాయి. గాదంకి గ్రామంలో, రోడ్డుపక్కన పేడదిబ్బలు ఉన్నాయి. ఇదే పంచాయతీకి చెందిన అమ్మోరుగుంట ఊరిలో, రోడ్డు పక్కన పేడ దిబ్బలు కనిపిస్తున్నాయి. ఈ పంచాయతీల్లో పేడదిబ్బలు, చెత్తకుప్పలను తొలగించేందుకు ప్రభుత్వం స్పెషల్ డ్రైవ్ నిర్వహించినా తొలగించలేదంటే అధికారుల నిర్లక్ష్యాన్ని అంచనా వేయవచ్చు. స్వచ్ఛాంధ్ర అంటూ ప్రభుత్వం ప్రచారం కల్పిస్తున్నా క్షేత్రస్థాయిలో అమలుకాకపోవడాన్ని బట్టి చూస్తే అధికారుల పర్యవేక్షణ ఏమేరకు ఉందో అర్థమవుతుంది.

గ్రామకార్యదర్శులదే బాధ్యత

గ్రామాల్లో, రోడ్ల పక్కన పేడదిబ్బలు, చెత్త కుప్పల నిల్వలు ఉంటే ఆయా గ్రామకార్యదర్శులదే బాధ్యత. సంబంధిత కార్యదర్శులపై చర్యలు ఉంటాయని జిల్లా పంచాయతీ అధికారి(డీపీవో) సుధాకరరావు హెచ్చరించారు. గాదంకి, ఎగువ ఎర్రమరాజుపల్లె పంచాయతీల్లో పేడ దిబ్బలు అలానే ఉన్నాయి. వీటిపై డీపీవో ఎలాంటి చర్యలు తీసుకుంటారోనని ఆయా గ్రామస్థులు వేచిచూస్తున్నారు.



కార్వేటినగరం మాడవీధుల్లో తిరుచ్చి వాహనంపై వేణుగోపాలుడి చిద్విలాసం - అర్ధగిరిలో పంచాంగ పఠనం చేస్తున్న ఆలయ అర్చకులు

వైభవంగా ఉగాది వేడుకలు



పాళ్యంకొండపై ఆంజనేయస్వామికి పూజలు నిర్వహిస్తున్న తారకరామ్

వెదురుకుప్పం, మార్చి 30(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలోని టీటీడీకి చెందిన రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో ఆదివారం ఉగాది ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఉభయ దేవేరులతో పాటు వేణుగోపాలస్వామి మూలవిరాట్టును పట్టు వస్త్ర, సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో అలంకరించి భక్తులను దర్శనానికి అనుమతించారు. సాయంత్రం నాలుగు గంటలకు రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వార్ల కొలువుదీర్పి ఉగాది ఆస్థానం నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులను తిరుచ్చి వాహనంపై ఆలయ మాడ వీధుల్లో ఊరేగించారు. భక్తులు కర్పూరహారతులను ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి 8.30 గంటలకు ఏకాంత సేవ నిర్వహించి స్వామిని పవళింపజేశారు. కార్యక్రమాల్లో ఆలయ ఇన్‌స్పెక్టరు సురేష్‌కుమార్, అర్చకులు రమేష్, శబరీష్, గోపాలస్వామి, షరాబు బాబు సురేష్, టీటీడీ ఉద్యోగులు పాల్గొన్నారు.

సాయినాథుడి సన్నిధిలో...

కార్వేటినగరంలోని బాలాజీనగర్‌లో వెలసి ఉన్న షిరిడీ సాయిబాబా ఆలయంలో ఉగాది సందర్భంగా బాబాను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఉభయదారులుగా కార్వేటినగరంకు చెందిన గాజుల నాగేశ్వరరావు వ్యవహరించారు.

- వెదురుకుప్పం, కార్వేటినగరం మండలాల్లోని ప్రజలు ఉగాదిని సంప్రదాయబద్ధంగా జరుపుకున్నారు. ఉగాది పచ్చడి రుచులను చూశారు.

తవణంపల్లె: ఉగాది వేడుకలను మండలంలో ఆదివారం ఘనంగా జరుపుకొన్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రం అర్ధగిరి వీరాంజనేయ స్వామి ఆలయంలో స్వామి వార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు వేణుగోపాలాచార్యులు పంచాంగ శ్రవణం చేశారు. అనంతరం భక్తులకు ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

గుడిపాల: మండలంలోని దేవాలయాల్లో ఆదివారం ఉగాది వేడుకలను భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. పాళ్యంకొండపై వెలసిన ఆంజనేయస్వామికి కోశాధికారి తారకరామ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. 197 రామాపురంలో వెలసివున్న జ్ఞానయజ్ఞేశ్వర ప్రసూనాంబ ఈశ్వరాలయం, కుప్పిగానిపల్లెలోని వళ్ళీసమేత సుబ్రహ్మణ్యస్వామి గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. భక్తులకు ఉగాది పచ్చడి పంపిణీ చేశారు.

నగరి: నగరి పట్టణ, మండల పరిధిలో వాడవాడలా తెలుగు సంవత్సరాది వేడుకలను వైభవంగా జరుపుకున్నారు. ఇంటిల్లిపాది వేకువజామునే ఆలయాలకు వెళ్లి మొక్కులు తీర్చుకున్నారు. పలుచోట్ల పంచాంగ శ్రవణం చేశారు. కరియమాణిక్యస్వామి ఆలయంలో వేదపండితులు ప్రసాద్‌శర్మ పంచాంగ శ్రవణం గావించారు.

కవి చంద్రశేఖర్‌కు సన్మానం



చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న కలెక్టర్

నగరి, మార్చి 30(ఆంధ్రజ్యోతి): ఉగాదిని పురస్కరించుకుని చిత్తూరులో కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదివారం నిర్వహించిన ఉగాది వేడుకల్లో నగరి మండలం ముడిపల్లి తెలుగు పండితులు చంద్రశేఖర్‌ను ఘనంగా సన్మానించారు. కలెక్టర్ ఆహ్వానం మేరకు ఉగాది వేడుకల్లో పాల్గొన్న ఆయన భువన విజయం నాటకంలో అయ్యలరాజు రామభద్ర కవి పాత్రలో కవితాగానంతో తన ప్రతిభను కనబరిచారు. ఈసందర్భంగా కలెక్టర్ ఆయనను సన్మానించారు.

'మన్ కీ బాత్'లో బీజేపీ నాయకులు



మన్ కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షిస్తున్న శేషాద్రికుమార్, సహ నాయకులు

వెదురుకుప్పం, మార్చి 30(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ ఆదివారం నిర్వహించిన మన్ కీ బాత్ కార్యక్రమాన్ని వెదురుకుప్పం మండలం బొమ్మయ్యపల్లె పంచాయతీ కొత్తూరులో బీజేపీ నాయకులు వీక్షించారు. ఎస్సీ మోర్చా జిల్లా ప్రధానకార్యదర్శి పాముల శేషాద్రికుమార్, బీసీ మోర్చా వెదురుకుప్పం మండల అధ్యక్షుడు బి.మురళి, పార్టీ మాజీ మండల అధ్యక్షుడు విశ్వనాథరెడ్డి, నాయకులు సోమశేఖర్‌రాజు, మునస్వామి, కేబీఏకనందన్, కిరణ్‌కుమార్, టీవీమునియప్పన్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆలయ అర్చక, పండితులకు వస్త్రాల బహూకరణ



వేదపండితుడికి వస్త్రాలు బహూకరిస్తున్న ఈవో పెంచలకిషోర్

ఐరాల(కాణిపాకం), మార్చి 30(ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో పనిచేస్తున్న అర్చక, పండితులకు ఆదివారం సాయంత్రం ఈవో పెంచలకిషోర్ వస్త్రాలను బహూకరించారు. ప్రతి ఏటా ఆలయంలో ఉగాది వేడుకల్లో భాగంగా అర్చక, పండితులకు నూతన వస్త్రాలను బహూకరించడం ఆనవాయితీగా వస్తోంది. కార్యక్రమంలో ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్ కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీ నాయుడు, అర్చక, పండితులు పాల్గొన్నారు.

ఘనంగా కాలబైరవ భస్మాభిషేక పూజలు



భస్మాభిషేక పూజకు ప్రదర్శనగా వెళ్తున్న కాలభైరవ ట్రస్టు నిర్వాహకులు

చిత్తూరు కల్చరల్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): నగరంలోని కామాక్షి అంబికా సమేత అగస్తీశ్వరాలయంలో ఆదివారం భస్మాభిషేక పూజలు ఘనంగా జరిగాయి. కాలభైరవ ట్రస్టు నిర్వాహకులు టి.వెంకటేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు అభిషేక ఉభయదారు, టీడీపీ యువ నేత వసంత్‌కుమార్ స్వామివారి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

జిల్లా అర్చక పురోహిత సంఘం ఉపాధ్యక్షుడిగా
రామభద్ర నియామకం



జిల్లా అర్చక పురోహిత సంఘం ఉపాధ్యక్షుడిగా రామభద్రకు నియామక పత్రాలు అందజేస్తున్న రాష్ట్ర కమిటీ నాయకులు

చిత్తూరు కల్చరల్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): జిల్లా అర్చక, పురోహిత సంఘం ఉపాధ్యక్షుడిగా నగరవాసి రామభద్రను నియమించారు. ఇటీవల విజయవాడలో నిర్వహించిన రాష్ట్ర అర్చక పురోహిత సంఘం సమావేశంలో కమిటీ నాయకులు దేమూరి ఆనంద్ సూర్యా, దూర్వాసుల రామశాస్త్రి నియామక పత్రాలు అందజేశారు. ఈ మేరకు ఆదివారం జిల్లా అర్చక పురోహిత సంఘం ఉపాధ్యక్షుడిగా నియమింపబడ్డ రామభద్రకు నగర అర్చక పురోహిత సంఘం ప్రతినిధులు అభినందనలు తెలియజేశారు.

భువనమ్మ సేవలకు ప్రతిఫలం
స్కోచ్ అవార్డు

కుప్పం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి, ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి చేసిన సామాజిక సేవలకు ప్రతిఫలంగా స్కోచ్ అవార్డు లభించిందని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ అన్నారు. ఎన్టీఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న న్యూట్రిఫుల్ యాప్‌తో ప్రజలకు డైట్, ఆరోగ్యంపై సూచనలు, సలహాలు అందిస్తున్నందున వచ్చిన స్కోచ్ అవార్డును ఆదివారం ఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో ఎన్టీఆర్ ట్రస్టుతోపాటు భువనేశ్వరి కూడా స్వీకరించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా భువనేశ్వరికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఇటువంటి అవార్డులు మరెన్నో అందుకోవాలని ఆయన ఆకాంక్షించారు.